సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 12 । జూలై । 2024



జగన్నాథ రథయాత్ర

కామారెడ్డి పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కనుల పండువగా సాగింది.

- 9లో ▸



సమస్యల సంత

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే సంత సమస్యల వలయంగా మారింది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.9 /24.5

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎంఎస్సీ ఫారెస్ట్రీ, ఫిషరీస్ కోర్సులు మంజూరు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు ఎంఎస్సీ ఫారెస్ట్రీ, ఫిషరీష్ కోర్సులు మంజూరయ్యాయి. రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో 45 ఏళ్లుగా బీఎస్సీ ఫారెస్ట్రీ, బీఎస్సీ ఫిషరీస్ డిగ్రీ కోర్సులు విజయవంతంగా నడుస్తున్నాయని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పీజీ కోర్సులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులు ఫారెస్ట్రీ, ఫిషరీస్ చదివిన విద్యార్థులకు ఇక్కడే పీజీ కోర్సులు చేయడానికి సౌకర్యం ఏర్పడిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య, అకడమిక్, పీజీ సమన్వయకర్తలు శంకరయ్య, అధ్యాపకులు రాజ్‌కుమార్, అధ్యాపకులు సుచరణ్, తిరుమల, మల్హార్ హర్షం వ్యక్తం చేశారు.

ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి లక్ష్య అవార్డు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి లక్ష్య అవార్డు వచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ గురువారం తెలిపారు. ఆస్పత్రిలో చేసిన సేవలకు అనుగుణంగా నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా లక్ష్య అవార్డును ప్రకటించడం జరిగిందన్నారు. అవార్డును అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు ఆస్పత్రికి ఎన్‌క్యూఏఎస్ అవార్డు



భిక్కనూరు: భిక్కనూరు ప్రభుత్వాస్పత్రికి ఎన్‌క్యూఏఎస్ అవార్డు దక్కింది. గురువారం అడిషనల్ కలెక్టర్ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌లు ఆస్పత్రి వైద్యురాలు యెమిమాకు పురస్కారాన్ని అందజేశారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా తాత్కాలికంగా కుటుంబ నియంత్రణ పద్ధతులపై మహిళలకు అవగాహన కల్పించడంతో ఈ అవార్డు వరించింది. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకట రమణ పాల్గొన్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు

సుభాష్‌నగర్: ఆధార్ సర్వర్‌లో సాంకేతిక లోపంతో గురువారం దేశవ్యాప్తంగా సేవలు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 12 గంటల తర్వాత నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో కొనుగోలు, అమ్మకందారులు గంటల తరబడి వేచిఉన్నారు. సాంకేతిక లోపం తలెత్తడంతో నిపుణులు లోపాన్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.





పచ్చందనమే.. పచ్చదనమే..

చుట్టూ గుట్టల మధ్య ఏటవాలుగా ఉన్న పుడిమి కొత్త అందాలను సంతరించుకుంది. కనుచూపు మేర పరుచుకున్న పచ్చదనం తనువును పులకరింపజేస్తోంది. విశాలమైన ఆ ప్రాంతంలో వరి, మక్క పంటలు తివాచీలా పరుచుకుని కనువిందు చేస్తున్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం భీర్మల్ తండా, గుర్జాల్ తండా, చిన్నగుర్జల్ తండా, యాచారం ప్రాంతాల్లో ఈ సుందర దృశ్యాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ట్రాన్స్‌ఫర్ టైం!

- అధికారులు, ఉద్యోగుల్లో అదే చర్చ
- శాఖల వారీగా బదిలీల కోసం కసరత్తు
- స్థానచలనం తప్పనివారు మంచి ప్లేస్ కోసం వెతుకులాట
- జీపీ కార్యదర్శి నుంచి జిల్లా అధికారుల దాకా..



సాక్షి, కామారెడ్డి: సుదీర్ఘకాలం తర్వాత ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు స్థానచలనం తప్పదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో జిల్లాకు చెందిన పలువురు అధికారులు బదిలీ అయ్యారు. తాజాగా సాధారణ బదిలీల నేపథ్యంలో జిల్లాస్థాయితో పాటు జోన్, మల్టీజోన్ పోస్టుల్లో కూడా చాలా కాలంగా పనిచేస్తున్న వారందరికీ బదిలీ తప్పదని అంటున్నారు. దీంతో ఎక్కువ కాలంగా ఉంటున్న వారితో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాలని అనుకుంటున్న వారు సైతం బదిలీ కోసం దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని శాఖల్లో దరఖాస్తులు స్వీకరించారు. మరికొన్ని శాఖల్లో కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఉపాధ్యాయులకు సంబంధించి ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో ఇతర ప్రభుత్వ శాఖల్లో నాలుగేళ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్న వారంతా బదిలీ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శుల నుంచి మొదలుకొంటే జిల్లాస్థాయి అధికారుల వరకు ఉద్యోగులంతా బదిలీల గురించే చర్చించుకుంటున్నారు. ఆయా శాఖల్లో ఉద్యోగులు, అధికారుల బదిలీల నేపథ్యంలో ఎవరెవరు బదిలీ అవుతారన్నదానిపై క్లారిటీకి వచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాజు చాలాకాలంగా జిల్లాలో పనిచేస్తున్నందున ఆయన బదిలీ తప్పదని అంటున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి లాలూనాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథ్, సర్వే లాండ్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు బదిలీ అయ్యే జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లాలోని వివిధ శాఖల్లో చాలా కాలంగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు చాలా మంది బదిలీ అవుతారని తెలుస్తోంది. గ్రామ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా నాలుగున్నరేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రిక్రూట్ చేసింది. అప్పటి నుంచి చాలా మంది తాము పనిచేస్తున్న ఊళ్లల్లోనే కొనసాగుతున్నారు. రిక్రూట్ అయిన నుంచి ఒకేచోట పనిచేస్తున్న వారిలో చాలా మంది ఈ సారి బదిలీ అవుతారని తెలుస్తోంది. వంద మందికి పైగా బదిలీ జాబితాలో ఉండే అవకాశాలున్నాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న కార్యదర్శులు తాము కోరుకుంటున్న స్థానాలకు సంబంధించి ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. ఒక్కొక్కరిని ఐదు ఆప్షన్లు అడిగారు. దీంతో వరుస క్రమంలో తమకు ఏ పంచాయతీ అయితే వస్తుందోనన్నదానిపై కసరత్తు చేసుకుని అందుకు అనుగుణంగా ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు.

కసరత్తు చేస్తున్న అధికారులు


జిల్లా పరిధిలో బదిలీలకు సంబంధించి స్థానికంగా కసరత్తు జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతర ఉద్యోగుల బదిలీలపై జిల్లా అధికారులు ఇప్పటికే జాబితాలను రూపొందించారు. బదిలీ అయ్యే ఉద్యోగులకు సంబంధించి వారు ఎంచుకున్న ఆప్షన్లను పరిశీలించిన తర్వాత వారి కోరిక మేరకు ఖాళీ ఉన్న వారు ఎంచుకున్న స్థానాలకు బదిలీచేసే అవకాశం ఉంది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలకు అనుగుణంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా శాఖలకు సంబంధించిన బదిలీల కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 20 లోపు బదిలీల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

ఏ కార్యాలయానికి వెళ్లినా అదే చర్చ

కలెక్టరేట్‌లోని ఏ శాఖ కార్యాలయంలోకి వెళ్లినా బదిలీల గురించిన చర్చే నడుస్తోంది. అధికారులు, ఉద్యోగులు ఎవరెవరికి బదిలీ అవుతాయి, ఎవరు ఎక్కడికి వెళ్లే అవకాశం ఉంది, ఎవరొస్తారు అన్నదానిపై చర్చించుకుంటున్నారు. బదిలీ అయ్యే అవకాశం ఉన్నవారంతా తాము పెట్టుకునే ఆప్షన్లపై కుస్తీ పడుతున్నారు. చాలా కాలంగా బదిలీ అవ్వకుండా ఉండిపోయిన వారంతా ఈ సారి తమకు అనుకూలమైన స్థానాల వెతుకులాటలో ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సైలు సొంత జిల్లాకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారి బదిలీలకు సంబంధించి క్లారిటీ రావడం లేదని తెలుస్తోంది.

ఎస్జీటీల ఆశలు ఆవిరి..!

- బదిలీ అయినా రిలీవ్ చేయని వైనం
- పాత స్థానాల్లోనే కొనసాగుతున్న 361 మంది టీచర్లు
- 32 శాతం టీచర్లు రిలీవ్ అయ్యేదెప్పుడో..
- రేషనలైజేషన్ కారణంగా పీటముడి



కామారెడ్డి టౌన్: ఎన్నో ఏళ్ల నిరీక్షణ అనంతరం బదిలీలు జరిగాయన్న ఆనందం ఎస్జీటీల్లో ఎంతో సేపు నిలవలేదు. బదిలీల ప్రక్రియలో భాగంగా స్థానచలనం కల్పించినా రిలీవ్ చేయకపోవడంతో వారి ఆశలు ఆవిరి అవుతున్నాయి. రేషనలైజేషన్ కారణంగా పీటముడి పడడంతో చేసేదేమీ లేక వందల మంది టీచర్లు యథాస్థానంలో కొనసాగుతున్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ పూర్తయినా ఇప్పటికీ 32 శాతం మంది టీచర్లు రిలీవ్ కాలేదు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

రేషనలైజేషన్‌లో భాగంగా గత ప్రభుత్వం 2021 ఆగస్టులో జీవో నంబర్ 25 జారీ చేసింది. పలు పాఠశాలలు మూతపడడంతో నూతన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. 1 నుంచి 10 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 11 నుంచి 40 మంది వరకు ఉన్న వాటికి ముగ్గురు, 61 మందికి పైబడి ఉన్న చోట అన్ని పోస్టులు భర్తీ అయి ఉండేలా ఆదేశాలిచ్చారు. అయితే బదిలీ అయిన వారందరినీ సత్వరమే రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బదిలీల ప్రక్రియ ముగిసి 10 రోజులు గడుస్తున్నా ఇంకా రిలీవ్ కానీ వారు తాము ఎప్పుడు కొత్తస్థానాల్లో చేరతామోనని ఎదురుచూస్తున్నారు.

నిబంధనల మేరకే బదిలీలు

జిల్లాలో నిబంధనల మేరకు ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బదిలీపై వస్తేనే ఇక్కడి ఉపాధ్యాయులకు వేరే పాఠశాలకు రిలీవ్ చేస్తారు. జిల్లాలో బదిలీ అయిన ఎస్జీటీలలో చాలా మంది వారి స్థానాల్లోకి వెళ్లారు. కొందరు మాత్రమే బదిలీ అయిన చోటుకు వెళ్లాల్సి ఉంది.

– రాజు, డీఈవో, కామారెడ్డి

768 మంది రిలీవ్..

జిల్లాలో 1,011 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఆరేళ్ల తర్వాత బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో గతనెల ప్రక్రియ పూర్తయింది. ఈనెల ఒకటో తేదీన మొత్తం 1,129 మంది ఎస్జీటీలకు సీనియారిటీ, నిబంధనల మేరకు విద్యాశాఖ బదిలీల తుది జాబితా ప్రకటించింది. ప్రస్తుతం వీరిలో 768 మంది ఉపాధ్యాయులు బదిలీపై కొత్త స్థానాలకు వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా మిగిలిన 361 టీచర్లు రేషనలైజేషన్ కారణంగా రిలీవర్ లేక పాత స్థానంలోనే కొనసాగుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖ రేషనలైజేషన్ నిబంధనలకు లోబడి ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎంఈవోలను ఆదేశించింది. అయితే బదిలీ అయిన వారిలో కొందరు నూతన స్థానాల్లో చేరగా మిగతా వారి స్థానాల్లోకి కొత్తగా వచ్చేందుకు టీచర్లు ఆప్షన్లు ఇవ్వలేదు. దీంతో కొత్త టీచర్లు వచ్చే వరకు బదిలీ అయిన వారు యథాస్థానంలో కొనసాగాల్సిన పరిస్థితి నెలకొంది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: అభివృద్ధి, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో నూతన నిర్మాణాలు, రిపేర్ల పురోగతిపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలతో పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్, సీడీపీ, ఇతర నిధులతో ఆయా శాఖల ద్వారా రోడ్లు, వివిధ శాఖల భవనాల నిర్మాణాలు, ప్రాజెక్టుల పనులు, మెడికల్ కళాశాల, ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల అభివృద్ధి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, మిషన్ భగీరథ, జాతీయ రహదారుల పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ విభాగం ద్వారా చేపట్టిన పనుల పురోగతి నెమ్మదిగా ఉందన్నారు. అధికారులు పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీచక టీచర్‌పై సస్పెన్షన్ వేటు

ఇన్‌చార్జి హెచ్‌ఎంతో పాటు రాజీకి యత్నించిన తొమ్మిది మందిపై పోక్సో కేసు

బాన్సువాడ రూరల్: దేశాయిపేట్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినిని లైంగికంగా వేధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం డీఈవో రాజు ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉపాధ్యాయుడిపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కమిటీ సహకారంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైనట్లు బాన్సువాడ ఎస్‌హెచ్‌వో మున్నూరు కృష్ణ తెలిపారు. అలాగే విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటన బయటకు పొక్కకుండా రాజీకుదర్చడంలో మధ్యవర్తిత్వం వహించిన సహోద్యోగులతో పాటు మరికొందరిపైనా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవు

బాలికలు, మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, పనిచేసే ప్రదేశాల్లో, ఇతర చోట్ల మహిళలు, చిన్నపిల్లలపై వేధింపులకు పాల్పడితే బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. మధ్యవర్తులు రాజీకి ప్రయత్నిస్తే వారిపైనా కేసులు తప్పవని హెచ్చరించారు.

ఎకరా కౌలు @ రూ. 60 వేలు



మేనూర్‌లో రైతు హన్మంత్ కౌలుకు తీసుకున్న భూమిలో అధికారులు

- రికార్డు స్థాయిలో దేవాదాయ భూముల ధర

మద్నూర్(జుక్కల్): ఆ ప్రాంతంలో కౌలుకు ఒక ఎకరం భూమి రూ. 20 వేలు.. బోరుబావుల కింద ఉన్న భూమి అయితే రూ. 30వేలు పలుకుతుంది. కానీ మేనూర్‌లోని దేవాలయానికి చెందిన భూమి ఎకరానికి ఏకంగా రూ. 60 వేలు పలకడం విశేషం. గ్రామంలోని హనుమాన్ ఆలయానికి చెందిన 14.16 ఎకరాల భూమిని గురువారం దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ ఆధ్వర్యంలో ఏడాది కోసం వేలంపాట నిర్వహించారు. ఇందులో మద్నూర్‌కు చెందిన గల్బేవార్ హన్మంత్ రూ. 8.51 లక్షలకు దక్కించుకున్నాడు. దీంతో ఎకరానికి రూ. 60 వేల చొప్పున ఆలయానికి భారీ ఆదాయం వచ్చిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దేవాలయానికి చెందిన భూమి కౌలు వేలం పాటలో పోటీ తీవ్రంగా ఉండడంతో కౌలు ధర అధికంగా పలికిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ పరిశీలకులు కమల, అధికారులు శ్రీధర్, రాం రవీందర్‌గుప్తా, వేణు, శ్రీధర్‌రావు, కల్పన పాల్గొన్నారు.

ఈ–పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి



మద్నూర్‌లో తనిఖీలు చేస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

మద్నూర్(జుక్కల్): విత్తన, ఎరువుల దుకాణదారులు రైతులకు ఈ–పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని పెద్ద ఎక్లార, మద్నూర్, మేనూర్‌లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు విక్రయించే అన్నింటికీ రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ అధికారి, ఆయా క్లస్టర్ల ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటలను ఏవో, ఏఈవోలు తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను ఎప్పటికప్పుడు సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో రాజు, ఏఈవోలు ప్రియాంక, బాజన్న, లక్ష్మణ్, సతీశ్, నాందేవ్, అనిల్, గజానన్, సమ్రిన్, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

టీసీసీ మార్కుల మెమోలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) ఒరిజినల్ మార్కుల మెమోలను డీఈవో కార్యాలయంలో 12వ తేదీ నుంచి తీసుకోవాలని డీఈవో ఎస్.రాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సర్టిఫికెట్‌లను తీసుకెళ్లాలని సూచించారు.

క్లుప్తంగా

13న బాన్సువాడలో భాషా పండితుల సభ

కామారెడ్డి అర్బన్: భాషాపండితుల పదోన్నతికి సంబంధించి దశాబ్దాల కలను సాకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలపడానికి ఈనెల 13న శనివారం ఉదయం 10 గంటలకు బాన్సువాడ సరస్వతి ఫంక్షన్‌హాల్‌లో సభను ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు నార్ల అరుణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్ శిక్షక్‌లు తెలిపారు. జిల్లాలోని తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

మైనారిటీ జూనియర్ కళాశాల తనిఖీ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం దేవునిపల్లి వాసవీకాలనీలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలను గురువారం జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్ తనిఖీ చేశారు. కళాశాలలో వసతులు, భోజనం, విద్యార్థుల చదువు తదితర వివరాలను ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ వివరించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత చదువులు చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు.

ప్రయోగాలతో సృజనాత్మకత పెరుగుతుంది



మాచారెడ్డి: ప్రయోగాలు చేస్తూ పాఠాలు బోధిస్తే విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట్ రమణారెడ్డి అన్నారు. గురువారం పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పలు ప్రయోగశాలలను ఆయన ప్రారంభించారు. కోడ్ హాఫ్ గ్లోబల్ సంస్థ వారి సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్, సైన్స్, ఎలక్ట్రానిక్ ప్రయోగశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోగశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రాజు, హెచ్ఎం గోవర్ధన్ రెడ్డి, బీజేపీ నాయకులు పొన్నాల వెంకట్ రెడ్డి, తోట బాల్ రాజు, పండ్ల ప్రవీణ్, పోసు అనిల్, బూస సురేష్, శ్రీనివాస్ గౌడ్, రఘు నాయక్, కల్యాణ్, రాములు, భరత్ ఉన్నారు.

రూ.60లక్షలకు టోకరా!

- జిల్లా కేంద్రంలో డ్వాక్రా లీడర్ నిర్వాకం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో డ్వాక్రా లీడర్ ఏకంగా రూ.60లక్షలకు టోకరా వేసింది. ఖిల్లా ప్రాంతానికి చెందిన సదరు మహిళ డ్వాక్రా గ్రూపునకు సంబంధించి రూ.4.60లక్షలు, గ్రామ సమాఖ్య నుంచి రూ.2.50లక్షలు తీసుకుంది. అలాగే గ్రూపు సభ్యులతోపాటు పలువురు మహిళల వద్ద రూ.54లక్షల వరకు తీసుకుంది. వారం రోజులుగా ఆమె ఇంటికి తాళం వేసి ఉండడం, ఆమెకు ఫోన్‌లు చేసినా స్పందించకపోవడంతో మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సదరు మహిళ భర్త ఆర్టీవో ఏజెంట్‌గా పని చేస్తున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

నేషనల్ హైవేలతో లింక్

- రూ.36 కోట్లతో వేల్పూర్ మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం
- మూడు మండలాలకు మెరుగైన రహదారి



జాతీయ రహదారులను కలుపుతూ నిర్మించిన డబుల్ రోడ్డు

వేల్పూర్: నేషనల్ హైవే 44, 63లను కలుపుతూ వేల్పూర్ మీదుగా డబుల్ రోడ్డు నిర్మించడంతో మండలంలోని వివిధ గ్రామాలకు రెండు జాతీయ రహదారులతో లింకు ఏర్పడింది. ఈ రోడ్డు నిర్మాణంతో వేల్పూర్‌తోపాటు బాల్కొండ, జక్రాన్‌పల్లి, మోర్తాడ్ మండలాల ప్రజలు రెండు వైపుల ఉన్న గ్రామాలకు ప్రయాణించేందుకు మార్గం సుగమమైంది. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి జక్రాన్‌పల్లి మండలంలోని బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల ద్వారా వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్, సాహెబ్‌పేట్ గ్రామాల మీదుగా వేల్పూర్ వరకు సుమారు 15 కిలోమీటర్ల దూరానికి రూ.21 కోట్లు, వేల్పూర్ నుంచి వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్ గ్రామాల మీదుగా 63 నంబరు జాతీయ రహదారిని కలుపుతూ సుమారు 8 కిలోమీటర్ల దూరానికి రూ.15 కోట్ల నిధులను రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించగా, నిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. గతంలో సింగిల్ రోడ్డు ఉండడం, కొన్ని గ్రామాల మధ్య రోడ్డు బాగా లేకపోవడంతో ఇతర మండలాల ప్రజలు దూరం ఎక్కువైనప్పటికీ ప్రధాన రహదారి వెంట తిరిగి వెళ్లేవారు. ప్రస్తుతం రెండు జాతీయ రహదారులను కలుపుతూ డబుల్‌రోడ్డు నిర్మాణం పూర్తవడంతో మూడు మండలాల ప్రజలు ఇతర మండల గ్రామాలకు తక్కువ సమయంలో సులువుగా వెళ్లగలుగుతున్నారు. వెంకటాపూర్, కోమన్‌పల్లి గ్రామాల మధ్య చెరువు కింద ఉన్న రోడ్డు వరదనీటికి తెగిపోయి కోమన్‌పల్లి, కుకునూర్ గ్రామాలకు వేల్పూర్‌తో రాకపోకలు నిలిచిపోయేవి. హైవేలతో లింకు కలిపే రోడ్డు నిర్మాణంతో వెంకటాపూర్ చెరువు కింద వరదనీరు వెళ్లిపోయేందుకు భారీ కల్వర్టు నిర్మించారు. అంతేకాకుండా రోడ్డు వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులువుగా వెళ్లగలుగుతున్నారు.

దూరం తగ్గింది



రెండు జాతీయ రహదారులను కలుపుతూ డబుల్‌రోడ్డు నిర్మాణం ఎంతో సౌకర్యంగా మారింది. మోర్తాడ్, కమ్మర్‌పల్లి వైపు వెళ్లేవారికి దూరం తగ్గింది. జాతీయ రహదారిని కలిపే డబుల్‌రోడ్డును నిర్మింపజేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సొద రమేశ్, జాన్కంపేట్

సమస్య పరిష్కారమైంది



మా గ్రామం మీదుగా వేల్పూర్ వైపు, 63 నంబరు జాతీయ రహదారి వైపు డబుల్‌రోడ్డు నిర్మాణంతో సమస్య శాశ్వతంగా పరిష్కారమైంది. వ్యవసాయ క్షేత్రాలకు ట్రాక్టర్లు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

– ఎడ్దండి రమేశ్, కుకునూర్

కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలి



అధ్యాపకులకు సూచనలిస్తున్న అధికారి సలామ్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలామ్ సూచించారు. గురువారం ఆయన, స్థానిక ప్రభుత్వ జూనియర కళాశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. మొదటి సంవత్సరంలో 131 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు అధ్యాపకులు ఆయనకు తెలిపారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి ప్రతిభను పరిశీలించారు. బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించి ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. అడ్మిషన్ల తేదీని ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు దుర్గయ్య, శివ, రాజయ్య, స్వామి, దరిసింగ్, నాగు, శ్రీలత, అంజయ్య, రజాక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ తక్షణమే అమలు చేయాలి



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రైతు సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోకి కట్టుబడి రైతు భరోసా రూ.15 వేలను ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రాన్ని అందజేశారు. బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, నాయకులు విపుల్, వేణు, వెంకట్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్(జుక్కల్): డోంగ్లీలోని ప్రధాన రహదారిపై రెండు ఫీట్ల లోతులో ఉన్న గుంతను చూసి వాహన చోదకులు భయపడుతున్నారు. డోంగ్లీ తహసీల్ కార్యాలయానికి దగ్గరలో ఎంతో కాలంగా గుంత ఏర్పడినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుగుతున్నా గుంతను మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సోమనాథం

కామారెడ్డి క్రైం: డ్రగ్స్ వాడకం, పర్యవసనాలు, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై కామారెడ్డిలోని వీఆర్కే జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. అనంతరం పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు, పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, దేవునిపల్లి ఎస్సై రాజు, కళాశాల డైరెక్టర్ జైపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యంమత్తులో ఉరేసుకొని ఆత్మహత్య

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న 80 క్వార్టర్స్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..80 క్వార్టర్స్‌లో ఉంటున్న సుమన్ మద్యం సేవించి తల్లితో గొడవపడ్డాడు. దీంతో ఆమె రేణుకానగర్‌లోని తన కుతూరి ఇంటికి వెళ్లిపోయింది. ఆ తరువాత మద్యం మత్తులో ఉన్న సుమన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

- రూ.70,350 నగదు స్వాధీనం

రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొతంగల్ మండలం జల్లాపల్లిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం రాత్రి 11 గంటలకు పేకాట స్థావరంపై దాడి చేయగా తొమ్మిది మంది పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.70,350 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ధర్పల్లి: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. టీవీఎస్ ఎక్సెల్‌పై తరలిస్తున్న 3.5 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. సివిల్ సప్లయీస్ అధికారుల ఫిర్యాదు మేరకు మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



పరశురాములు (ఫైల్)

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం గూడెం గ్రామానికి చెందిన ముక్కర పరశురాములు(45) అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు గురువారం తెలిపారు. ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన పరశురాములు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య సర్పవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



అవార్డులు ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: కుటుంబ నియంత్రణ పాటించడంపై అవగాహన అవసరమని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జనాభా నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు. అంతర ఇంజక్షన్ల వాడకం, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. 2024 నాటికి ప్రపంచ జనాభా 800 బిలియన్లకు చేరిందన్నారు. 2050 నాటికి 970 బిలియన్లకు చేరే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్యసదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. అందుకే జనాభా నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తుందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పీహెచ్‌సీలకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ప్రోగ్రాం అధికారిణి శోభారాణి, మెడికల్ ఆఫీసర్‌లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

కామారెడ్డి టౌన్: జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు రమేష్ మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు కనీస వేతనం అమలు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ప్రకాశ్, కిశోర్, సురేశ్, దామోదర్, గోపాల్, వెంకట్ పాల్గొన్నారు.

రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేదెవరు?



బేగంపూర్ శివారులో వేసిన మొక్కజొన్న



పంటకు ఆశించిన మొగి పురుగు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మొగి పురుగు నివారణ చర్యలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడంలేదని బేగంపూర్ గ్రామ రైతులు వాపోతున్నారు. మండలంలోని బేగంపూర్ గ్రామ శివారులో మొక్కజొన్నకు ప్రారంభ దశలోనే మొగి పురుగు సోకింది. దీనిపై వ్యవసాయ అధికారులు ఎలాంటి అవగాహన కల్పించడం లేదని రైతులు చెబుతున్నారు. రైతు వేదికలలో కానీ గ్రామాల్లో కానీ పంటలకు ఆశించే చీడపీడ రక్షణ కోసం ఎలాంటి అవగాహన సదస్సులు వ్యవసాయ అధికారులు నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. రైతువేదికలు ఏర్పాటు చేసి ఏమి లాభమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు పంటల రక్షణపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి నివారణ చర్యలు సూచించాలని కోరుతున్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ఖలీల్‌వాడి: సిద్దిపేట బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది రవికుమార్‌పై అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉమారెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడిని బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పోలీసు అధికారి ఉమారెడ్డిని వెంటనే సర్వీస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: అత్యవసరం ఉందంటూ వ్యాపారులను నమ్మిస్తూ ఫోన్‌పే ద్వారా మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా రెంజర్ల మండలానికి చెందిన జమొల్ల భరత్, ధరంసోత్ సాయి కిరణ్, రాథోడ్ అరుణ్, రాథోడ్ జీవన్ స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఫేక్ యాప్ ద్వారా డబ్బులు పంపకున్నా పంపినట్లు ఫేక్ మెసేజ్ చూపించి నిజామాబాద్, రామాయణంపేట్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలో మోసాలకు పాల్పడ్డారు. గత నెల 2న జిల్లా కేంద్రంలోని పోలీస్ పెట్రోల్ బంక్‌కు జమొల్ల భరత్ అతని స్నేహితులతో కలిసి వచ్చాడు. పెట్రోల్ పోసే వ్యక్తితో అత్యవసరం ఉందని మాయ మాటలు చెప్పి రూ.8 వేల నగదు ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా పే చేసినట్లు నమ్మించి నగదు తీసుకున్నాడు. గత నెల 28న జిల్లా కేంద్రంలోని కావేరి పెట్రోల్ బంక్‌కు వచ్చి బంధువులు ఆస్పత్రిలో ఉన్నారని నమ్మబలికి వారికి ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు చూపించి రూ.8 వేల నగదు తీసుకుని ఉడాయించారు. వ్యాపారి తమ ఖాతాను పరిశీలించే సరికి నగదు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా గురువారం అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి నాలుగు ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్.. రిమాండ్

భీమ్‌గల్: నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ మండలాల్లోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. కేసులకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. బాల్కొండకు చెందిన బట్టు సతీశ్, ఆర్మూర్‌కు చెందిన చిట్యాల రాజు, రూపేశ్ ముఠాగా ఏర్పడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై చిరంజీవి రెండు బృందాలుగా ఏర్పడి కేసుల దర్యాప్తు చేపట్టారు. గురువారం భీమ్‌గల్ నందిగల్లీ పోచమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా వ్యవహరించిన బట్టు సతీశ్, చిట్యాల రాజు అదుపులోకి తీసుకొని విచారించగా ఆలయాల్లో చోరీలకు పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని సభ్యుడు రూపేశ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని సీఐ అన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు బృందం సభ్యులను ఆర్మూర్ ఏసీపీ అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండురోజుల జైలుశిక్ష

బోధన్‌రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన మహారాష్ట్రలోని కొండల్‌వాడికి చెందిన షేక్ షారుక్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. మూడురోజుల క్రితం వాహనాలు తనిఖీ చేస్తుండగా షారుక్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. సదరు వ్యక్తిని గురువారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్ష విధించారన్నారు.

క్రైం కార్నర్

పాముకాటుతో రైతు మృతి



శంకర్(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహ్మద్‌నగర్ మండలం గిర్నితండాకు చెందిన రైతు కడావత్ శంకర్(42) పాముకాటుతో మృతి చెందాడు. గురువారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. రైతు శంకర్ వరినాట్ల కోసం పొలానికి ఒడ్డు ఒరం పనులు చేస్తుండగా పాముకాటు వేసింది. అయినప్పటికీ శంకర్ గుర్తించకుండా పనులు చేస్తుండగా, కొద్దిసేపటి తరువాత నోట్లో నుంచి నురుగులు వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. పక్కన పొలంలో పని చేస్తున్న మహిళా కూలీలు అక్కడికి చేరుకుని సరికి శంకర్ పరిస్థితి విషమంగా మారింది. వారు వెంటనే శంకర్ కుటుంబ సభ్యులకు, తండావాసులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

సాలంపాడ్‌లో విద్యుత్‌షాక్‌తో..



రాంబాబు (ఫైల్)

బోధన్‌రూరల్: సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్ గ్రామానికి చెందిన మారం రాంబాబు రెడ్డి (36) అనే రైతు విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ గురువారం తెలిపారు. తెల్లవారు జామున గ్రామశివారులోని వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రాంబాబురెడ్డి బోరు మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు.

చెరువులో పడి మహిళ..



బాలవ్వ (ఫైల్)

వర్ని (మోస్రా): మండల కేంద్రానికి చెందిన ముదిగేపల్లి బాలవ్వ (45) ప్రమాదవశాత్తు ఊర చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం గేదెలను కడిగేందుకు చెరువులోకి దిగిన బాలవ్వ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిందన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలోని బాసర రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మహంతం గ్రామానికి చెందిన రఘుపతి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిముగించుకుని, బైక్‌ను టర్న్ చేస్తుండగా అటువైపుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రఘుపతి తల, కాళ్లకు గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.